


TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :146 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ మంగళవారం- 23 - జూన్- 2026

### జులైలో యూకే కొత్త ప్రధాని
## ప్రమాణస్వీకారం!



★ బ్రిటన్ ప్రధాని పదవి నుంచి తప్పుకుంటున్నట్లు కీర్ స్టార్మర్ తాజాగా ప్రకటించారు.

★ అయితే, వచ్చే నెలలోనే కొత్త ప్రధాని దేశ పగ్గాలు చేపట్టే అవకాశం ఉందని అన్నారు.

### ఇరాన్‌తో చర్చలు సానుకూలం
## శాంతి ఒప్పందానికి బలమైన పునాది

● ఇరాన్‌తో జరిగిన తొలి విడత చర్చలు విజయవంతమయ్యాయని అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాఖ్యలు

● యుద్ధానికి శాశ్వత ముగింపు పలికే ఒప్పందానికి పునాది పడిందన్న జేడీ వాన్స్



ఢిల్లి : అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న శాంతి చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. యుద్ధానికి శాశ్వత ముగింపు పలికే తుది ఒప్పందానికి ఈ చర్చలు బలమైన పునాది వేశాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడిన వాన్స్, "తుది ఒప్పందం ఒక ఇంటిలాంటిది. మేము ఇంకా ఆ ఇంటిని నిర్మించలేదు. కానీ దాన్ని నిర్మించేందుకు అవసరమైన పునాదిని విజయవంతంగా వేశాం. ఇది అమెరికా ప్రజలకు మంచి ఫలితాలను అందించే దిశగా కీలక అడుగు" అని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన అమెరికా- ఇరాన్ యుద్ధానికి శాశ్వత పరిష్కారం కనుగొనే లక్ష్యంతో స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో అమెరికా తరఫున జేడీ వాన్స్, ఇరాన్ తరఫున ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ మిగతా..2లో

### లఖ్‌నవూలో ఘోర
## అగ్నిప్రమాదం 15 మంది మృతి!

❖ ఉత్తరప్రదేశ్ లోని లఖ్‌నవూలో అగ్నిప్రమాదం- 15 మంది మృతి-

❖ మరికొందరు అభ్యర్థులు భవనంలోపల చిక్కుకున్నారని భావిస్తున్న పోలీసులు



ఢిల్లి : ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్ నవూలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో మొదట 8 మంది మృతి చెందగా, ఇప్పుడు ఆ సంఖ్య 15కు పెరిగింది. పలువురు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఇంకా కొందరు వ్యక్తులు లోపల చిక్కుకుపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మంటలు నుంచి తప్పించుకునేందుకు భవనంలోపల ఉన్న విద్యార్థులు కిందకు దూకేసిన దృశ్యాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. సహాయక చర్యలను యూపీ డిప్యూటీ సీఎం బ్రిజేశ్ పాఠక్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మిగతా..2లో

### 30 నెలల్లో వినాశనం..
### చీకటిని చూస్తేనే వెలుగుకు విలువ



★ బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను చూసుకుంటే...

★ కాంగ్రెస్ నేతలు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు.

★ కాంగ్రెస్ చెప్పిన అబద్దాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు.

హనుమకొండ, జూన్ 22: బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను చూసుకుంటే... కాంగ్రెస్ నేతలు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్,

### కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ..
## తెలంగాణ అభివృద్ధిపై కీలక చర్చలు

▶▶ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు.

▶▶ ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు.



ఢిల్లీ, జూన్ 22 : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో (సోమవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి. సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో మిగతా..2లో

### ఆర్డీఎస్‌లో తెలంగాణ నీటి
## వాటాపై రాజీ లేదు



● తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

● రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు.

హైదరాబాద్, జూన్ 22: తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల

## చల్లని కబురు వచ్చేసింది! - రాగల నాలుగు రోజుల్లో వర్షాలు!

### తెలంగాణకు భారీ వర్ష సూచన
### ఏపీలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్!



అమరావతి : ఉభయ తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావం కారణంగా తెలంగాణలో ఐదురోజులు, ఏపీలో నాలుగు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఏపీ సరిహద్దు జిల్లాలైన నల్లగొండ, సూర్యాపేటకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు రేపటి కల్లా విస్తరిస్తాయని పేర్కొంది. ఇక ఏపీలోనూ ఈ నెల 26వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉంటాయని, 40 నుంచి 50కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మిగతా..2లో

## అగ్నిప్రమాదంపై ప్రధాని విచారం.. ఎక్స్‌గ్రేషియా ప్రకటన



" లక్నోలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను.

మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం అందజేస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు.

గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

యూపీ: లక్నోలోని కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ స్పందించారు. " లక్నోలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి అధికారులు సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నారు". మిగతా..2లో

### ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల
### ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం



★ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే సీఎం చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేశ్ వెల్లడించారు.

★ ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందన్నారు.


న్యూఢిల్లీ, జూన్ 22: ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం

### ఆ పార్టీల కుట్ర - ప్రతి అంశాన్ని
## రాజకీయం చేసే యత్నం

● ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు

● మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కారం

● ఆర్టీజీఎస్‌పై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి : రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని, ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారని దుయ్యబట్టారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. మిగతా..2లో

### పులివెందులలో మూడు రోజులు పాటు
## పర్యటించనున్న జగన్



○ ప్రజలను నేరుగా కలవనున్న వైసీపీ అధినేత

○ రేపు సాయంత్రం పులివెందులకు చేరుకోనున్న వైసీపీ అధినేత

○ నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్న జగన్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ రేపటి నుంచి తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. రేపటి నుండి జూన్ 25 వరకు సాగే ఈ పర్యటనలో ఆయన స్థానిక నేతలతో సమీక్షలు జరపడంతో పాటు ప్రజలను నేరుగా కలవనున్నారు. రేపు సాయంత్రానికి జగన్ పులివెందులకు చేరుకుంటారు. అక్కడ ఉన్న మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## పులివెందులలో మూడు రోజులు పాటు పర్యటించనున్న జగన్

తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అక్కడికక్కడే 'ప్రజాదర్బార్' కూడా నిర్వహించనున్నారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన జూన్ 24 ఉదయం వేముల మండలం భూమయ్యగారిపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని జగన్ సందర్శించనున్నారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. గుడి దర్శనం ముగించుకుని మధ్యాహ్నానికి మళ్లీ పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు రానున్న జగన్.. ఆ రోజు మొత్తం ప్రజలు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి మాట్లాడుతారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల అర్జీలను స్వీకరిస్తారు. అనంతరం మూడు రోజుల పర్యటన ముగించుకుని జూన్ 25వ తేదీ గురువారం ఉదయం పులివెందుల నుంచి తిరుగుపయనమవుతారు.

## ఇరాన్‌తో చర్చలు సానుకూలం
## శాంతి ఒప్పందానికి బలమైన పునాది

బాఘర్ ఖాలిబఫ్ పాల్గొన్నారు. ఆదివారం ప్రారంభమైన ఆ సమావేశాలు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. చర్చల సమయంలో కొన్ని విభేదాలు, ఉద్రిక్త పరిస్థితులు ఎదురైనా, పలు అంశాలపై ఇరు దేశాలు అవగాహనకు వచ్చినట్లు సమాచారం. అలాగే అమెరికా సోయాబీన్, మొక్కజొన్న, గోధుమల వంటి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఇరాన్‌కు అవకాశం కల్పించే అంశాన్ని కూడా అమెరికా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు జేడీ వాన్స్ తెలిపారు. ఇందుకోసం ఇరాన్‌కు చెందిన కొన్ని ఆస్తులను అన్‌ఫ్రీజ్ చేసే అవకాశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. స్విట్జర్లాండ్ మధ్యవర్తిత్వంలో జరిగిన ఆ చర్చలు భవిష్యత్తులో సమగ్ర శాంతి ఒప్పందానికి దారి తీస్తాయని ఇరు దేశాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## జులైలో యూకే కొత్త ప్రధాని ప్రమాణస్వీకారం!

ఢిల్లీ : యూకే ప్రధాని పదవి నుంచి తప్పుకున్నట్టు లేబర్ పార్టీ నేత కీర్ స్టార్మర్ తాజాగా ప్రకటించారు. అయితే, వచ్చే నెలలోనే నూతన ప్రధాని ప్రభుత్వ పగ్గాలు చేపట్టే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం పార్టీ మద్దతు ఉన్న ఎంపీ ఆండీ బర్న్‌హ్యామ్ అభ్యర్థిత్వాన్ని ఎవరూ వ్యతిరేకించకుండా ఉంటే ఆయన వచే నెలలో ప్రధాని పీఠాన్ని అధిరోహించే అవకాశం ఉంది. ప్రభుత్వ పనితీరుపై సొంత పార్టీలోనే విమర్శలు పెరగడంతో స్టార్మర్ తప్పుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. అయితే, తన పాలనలో పార్టీకి అనేక విజయాలు దక్కాయని రాజీనామా ప్రకటన సందర్భంగా స్టార్మర్ బలంగా వాదించారు. దేశ ఆర్థిక వ్యవస్థ మునుపటి కంటే మెరుగైందని చెప్పారు. ఉద్యోగులు, వర్కర్ల జీతాలు పెరిగాయని చెప్పారు. లేబర్ పార్టీపై ప్రజాభిప్రాయాన్ని మార్చామని చెప్పారు. తన పాలనలో దేశంలో అక్రమ వలసలకు కూడా అడ్డుకట్ట పడిందని అన్నారు. వేల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే దానిపై కూడా స్టార్మర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆండీ బర్న్‌హామ్ అభ్యర్థిత్వా ఎవరూ వ్యతిరేకించకపోతే ఆయన వచ్చే నెలలోనే ప్రధాని పగ్గాలు చేపడతారని అన్నారు. ఒక వేళ ఎన్నికలు జరగాల్సి వస్తే ఆగస్టు నాటికి నూతన ప్రధాని యూకే పగ్గాలు చేపడతారని చెప్పారు. ఈ దిశగా ఒక టైమ్‌టేబుల్‌ను రూపొందించాలని పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి కూడా సూచించానని చెప్పారు. నూతన ప్రధానికి తన పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.

## ఖఅగ్నిప్రమాదంపై ప్రధాని విచారం.. ఎక్స్‌గ్రేషియా ప్రకటన

"అని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం అందజేస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. కాగా ఈ రోజు (సోమవారం) మధ్యాహ్నం లక్నోలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ..
## తెలంగాణ అభివృద్ధిపై కీలక చర్చలు

పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమార్వో హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు ముఖ్యమంత్రి. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు సీఎం. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

## ఆర్డీఎస్‌లో తెలంగాణ నీటి వాటాపై రాజీ లేదు

కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అయినా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఈసారి ఈ 7 రకాల సన్నాలకే ప్రభుత్వ బోనస్
## విత్తనాలు కొనే ముందు ఓసారి చూసుకోండి

7 రకాల సన్నవడ్లనే పండించాలని రైతులకు సూచిస్తున్న సర్కారు

వాటికి మాత్రమే బోనస్ బోనస్ ఇవ్వాలని యోచన

ఈనెల 23 నుంచి విత్తన మేలాలు నిర్వహించి, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని నిర్ణయం



రాష్ట్రంలో ఏటా రైతులు 33 రకాలైన సన్న వరి సాగు చేసేవారు. వీటిల్లో కొన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తుండగా, మిగతావి ప్రైవేటు మిల్లర్లు కొంటున్నారు. రైస్ మిల్లర్లు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్నదాతలను ఇబ్బందులు పెడుతున్నారు. కొంతమంది మీరు పండించిన ధాన్యం రకం కొనలేమని చేతులెత్తేస్తున్నారు. మరి కొంతమంది 50 కిలోల బస్తాకు రెండు నుంచి 4 కేజీల తరుగును తీస్తున్నారు. వీటిని గుర్తించిన ప్రభుత్వం ఏడు రకాల సన్నాలనే పండించాలని రైతులకు సూచిస్తోంది. రైతు వేదికల్లో ఈ నెల 23 నుంచి విత్తన మేళాలను నిర్వహించి, వాటి ప్రయోజనాలపై అన్నదాతలకు విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. వీటికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు (ఎంఎస్ పీ) అదనంగా రూ.500 బోనస్ ను చెల్లించాలని భావిస్తోంది.

### ఆ 7 రకాలు ఇవే :

తెలంగాణ సోన రకం (ఆర్ఎన్ఆర్-15048) : పంట కాలం వ్యవధి 120నుంచి 125రోజులు ఉంటుంది. ఇవి బ్లాస్ట్ వ్యధిని తట్టుకోగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. హెడ్ రైస్ రికవరీ 67 శాతంపైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సాంబ మసూరి రకం (బీపీటి-5204) : ఈ పంట కాలపరిమితి 145 నుంచి 150 రోజులు ఉంటుంది. సుగంధబరితమైన ధాన్యం గింజ. ఎగుమతులకు అనుకూలంగా ఉంటుంది. కేఎన్ఎం (1638) : కేఎన్ ఎం పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు ఉంటుంది. వ్యాధులను తట్టుకొనగలిగే శక్తి ఉంటుంది. హెచ్ఎంటీ సోన : ఈ పంట కాలపరిమితి 135 నుంచి 145 రోజులు ఉంటుంది. సూపర్ ఫైన్ రకం తెల్లని గింజ. అద్భుతమైన రుచి. మార్కెట్‌లో ఈ రకం ధాన్యానికి మంచి డిమాండ్ ఉంది. జైశ్రీరాం : ఈ రకం పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు. అధిక దిగుబడినిస్తుంది. వర్షాకాలం, యాసంగి సీజన్ లో సాగుకు అనుకూలం. వీజీఎల్-44 : వీజీఎల్ పంట కాలవ్యవధి 130 నుంచి 145 రోజులు ఉంటుంది. స్థిరమైన దిగుబడి. అన్నిరకాల నేలలకు అనుకూలం. కేఎన్ఎం (7715) : ఈ పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు. సూపర్ ఫైన్ రకం. మార్కెట్‌లో వీటిని మంచి డిమాండ్ ఉంది. సాగులోనూ స్థిరత్వం ఉంటుంది. సన్నాలకే పెద్దపీట : ఎల్‌నినో నేపథ్యంలో క్రయవిక్రయాలు, ఎగుమతులు, వినియోగ అవసరాల నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలో వరి సాగులో సన్నాలకే పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని వ్యవసాయశాఖ భావించగా ఇందులో 69 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది. వాటిల్లో 7 సన్న రకాలనే 38.19 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ 7 రకాలే గత సీజన్‌లో 27.88 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. నిరుటి కంటే 10.31 లక్షల పెంచి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. బోనస్ వర్తింపు, సాగు విస్తీర్ణం పెంపుదల, పంపిణీ, సబ్సిడీ, విత్తనాల లభ్యత, తదితర అంశాలను వ్యవసాయ శాఖ మంత్రిమండలి ఆమోదానికి సమర్పించింది. ముందు పూర్తి ధర చెల్లించాలి : రైతన్నలు కొనుగోలు చేసిన విత్తనాలకు ముందుగా పూర్తి ధరను చెల్లించాల్సి ఉంటుంది. పంట కాలం ముగిసేంత వరకు బిల్లును భద్రపరచుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈవో) ఆ రైతు పొలాన్ని సందర్శించి, కొనుగోలు చేసినటువంటి విత్తనాలనే పంట సాగుకు ఉపయోగించారని ధ్రువీకరిస్తారు. అప్పుడు విత్తన సబ్సిడీ రైతుల అకౌంట్లలో పడుతుంది.

# చల్లని కబురు వచ్చేసింది! - రాగల నాలుగు రోజుల్లో వర్షాలు!

మొదటి పేజి తరువాయి

"ఎరుపు, పసుపు, ఆకుపచ్చ" మూతలు - వాటర్ బాటిల్స్ రంగుల అర్థాలు తెలుసా?



రాష్ట్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉత్తర కోస్తా, కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. అదే విధంగా భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్లసంభవించే అవకాశం ఉంది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాయలసీమలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం , భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఒకటీ రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని, ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. మూడు ప్రాంతాల్లో ఈ నెల 27, 28 రెండు రోజుల్లో వాతావరణ హెచ్చరిలు ఏమీ లేదని స్పష్టం చేసింది.

# ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

### సీఎం విజన్..

### వి2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేశ్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ '3ఎ'- స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. 'మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో (ఖీణ×) 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేశ్ ప్రకటించారు.

### రికార్డు కాలంలో ప్రాజెక్టుల పురోగతి

రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు.

రక్షణ ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్-జావీజూ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.

గూగుల్ డేటా సెంటర్: గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం.

అమరావతి సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్.. 2028 నాటికి కోర్ క్యాపిటల్

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ.60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని అన్నారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ.. 'ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో



ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో ఏపీ గొంతు ఎంతో బలంగా వినిపిస్తోంది' అని లోకేశ్ అన్నారు.

### టీడీపీలో జనరేషన్ షిఫ్ట్.. యువతకు పెద్దపీట

రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' (నాయకత్వ మార్పు) కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# లఖ్‌నవూలో ఘోర అగ్నిప్రమాదం- 15 మంది మృతి!

మొదటి పేజి తరువాయి

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూ అలీగంజ్ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించి అదే భవనంలోని రెండో అంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్ , గేమింగ్ జోన్ , సాఫ్ట్ వేర్ ఆఫీసులను చుట్టుముట్టాయి. మంటల్లో చిక్కుకుని కోచింగ్ సెంటర్‌లోని పలువురు సజీవదహనం అయ్యారు. తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. కొందరు ప్రాణాలను రక్షించుకునేందుకు భవనం పైనుంచి కిందకు దూకే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 15 మంది ప్రాణాలు కోల్పోగా పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏకంగా 14 ఫైర్ ఇంజిన్లు, ఒక హైడ్రాలిక్ ప్లాట్‌ఫారమ్ వాహనంతో మంటలను ఆర్పివేశారు. భవనం లోపల దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో భవనం గోడను పగలగొట్టి లోపలికి



ప్రవేశించారు. ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి బ్రిజేశ్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కొందరు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని చెప్పారు. రెస్క్యూ సిబ్బంది ప్రతి గదిని, బాత్రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు.

### ప్రత్యక్ష సాక్షులు ఏం చెబుతున్నారు?

వాణిజ్య భవనంలో మొదట మూడో అంతస్తులో మంటలు అంటుకున్నాయి. అయితే చూస్తుండగానే అవి ఆఫీస్ మొత్తాన్ని చుట్టుముట్టాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్యాలయంలో 20 నుంచి 30 మందికి పైగా ఉండొచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో అక్కడ ఒక్కసారిగా తొక్కిసలాట, గందరగోళం ఏర్పడింది. భవనంలో పనిచేస్తున్న వారు, ఇతరులు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి అటూఇటూ పరుగులు తీశారు. బయటకు రావడానికి ఎలాంటి దారులు కనిపించకపోవడంతో, పక్కనే వేలాడుతున్న ఒక వైర్ ను పట్టుకొని కిందకు దూకడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక యువతి సహా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని కార్యాలయం ప్రకటించింది. క్షతగాత్రులకు 50వేల రూపాయలు ఇవ్వనున్నట్లు పేర్కొంది. భవనంలో ఎంతమంది చిక్కుకున్నారు? ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# ఆ పార్టీల కుట్ర - ప్రతి అంశాన్ని రాజకీయం చేసే యత్నం

మొదటి పేజి తరువాయి



ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు : ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని గుర్తు చేశారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చంద్రబాబు తెలిపారు. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేసేలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరమని గుర్తుచేశారు. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజల ముందుకు రెండేళ్ల అభివృద్ధిపై నివేదికలు : మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలను నేరుగా ప్రజల ముందు ఉంచనుంది. ఇందుకోసం ఆయా రంగాల వారీ 10 అంశాలపై నివేదికలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే నిర్ణయించారు. 10 అంశాల్లో అభివృద్ధి, ఆర్థిక రంగం, సుపరిపాలన, సంక్షేమం-సాధికారత అంశాలకు సంబంధించిన నివేదికలను ముఖ్యమంత్రి విడుదల చేస్తారు.

# 30 నెలల్లో వినాశనం.. చీకటిని చూస్తేనే వెలుగుకు విలువ

మొదటి పేజి తరువాయి

సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్దాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు' అని చెప్పారు. దేశం మొత్తం కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుందని.. కానీ 420 హామీలు ఇవ్వడంతో తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. బాండ్ పేపర్లు ఇచ్చి, పథకాల వరద పారిస్తామన్నారని తెలిపారు. సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద తప్ప... అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. కందలు తిరిగిన ఉస్తాదు అయినా మూడు నెలల్లోనే పిల్లలను పుట్టిస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. మూడు నెలల్లోనే పిల్లలు పుట్టరని తెలుసని, కానీ 30 నెలల్లో పుట్టకపోతే ఏమనాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో బూతుల మోతలు, పచ్చి అబద్ధాలు తప్ప ఏమీ లేవని మాజీ మంత్రి విమర్శించారు. ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం తప్పదని మొదటినుంచీ చెబుతున్నామని అన్నారు. వంద సార్లు ఢిల్లీకి పోయిన సీఎం రేవంత్.. రాష్ట్రానికి వంద పైసలైనా తెచ్చారా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే.. డబ్బుల సంచులన్నీ



ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఎగొట్టి, యూరియా కోసం లైన్‌లలో నిలబడే పరిస్థితికి రైతులను తీసుకొచ్చారన్నారు. 30 నెలల్లో వినాశనం జరిగిందని.. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## భారత్‌కు అమెరికా మరో రక్షణ సహకారం- అపాచీ, ఎం777 హోవిట్జర్ల నిర్వహణకు ఆమోదం

భారత సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్లు, ఎం777ఏ2 హోవిట్జర్లకు దీర్ఘకాలిక నిర్వహణ సేవలు అందించనున్న అమెరికా

మొత్తం 482.2 మిలియన్ డాలర్ల విలువైన సహాయ ప్యాకేజీకి అమెరికా కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం

భారత్‌కు రక్షణ రంగంలో మరో కీలక సహకారాన్ని అందించేందుకు అమెరికా ముందుకొచ్చింది. భారత సైన్యం వినియోగిస్తున్న అపాచీ యుద్ధ హెలికాప్టర్లు, ఎం777ఏ2 అల్ట్రా-లైట్ హోవిట్జర్లకు అవసరమైన నిర్వహణ, సాంకేతిక సహాయం, విడిభాగాల సరఫరా, శిక్షణ సేవలను అందించనుంది. అందుకోసం మొత్తం 482.2 మిలియన్ డాలర్ల విలువైన సహాయ ప్యాకేజీని అందించనున్నట్లు అమెరికా అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించి అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్‌కు అధికారిక సమాచారాన్ని అందించింది. అమెరికా విదేశీ సైనిక విక్రయాల (ఎఫ్ఎంఎస్) కార్యక్రమాన్ని నిర్వహించే డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ (డీఎస్‌సీఏ) జూన్ 17న ఈ సర్వీసులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెల మే 18నే అమెరికా విదేశాంగ శాఖ భారతదేశానికి ఈ సేవలను అందించేందుకు కాంగ్రెస్‌కు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. దీంతో భారత్ అమ్ములపొదిలోని కీలక ఆయుధాల నిర్వహణ, లాజిస్టిక్స్, శిక్షణ, సాంకేతిక సాయం వంటి వాటికి ఇబ్బంది ఉండదు.

ఎం777 హోవిట్జర్లకు 230 మిలియన్ డాలర్ల మద్దతు

ప్రస్తుతం భారత సైన్యం ఎం777ఏ2 అల్ట్రా- లైట్ హోవిట్జర్లను విస్తృతంగా వినియోగిస్తోంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో వేగంగా మోహరించగల సామర్థ్యం ఉండటం వల్ల ఇవి వ్యూహాత్మకంగా కీలకంగా మారాయి. ఈ హోవిట్జర్లకు సంబంధించిన నిర్వహణ, విడిభాగాల, సరఫరా, మరమ్మతులు, సాంకేతిక సాయం, శిక్షణ, ఫీల్డ్ సర్వీస్ ప్రతినిధుల సేవలు, లాజిస్టిక్స్ మద్దతు వంటివి అందించనుంది. వాటి కోసం సుమారు 230 మిలియన్ డాలర్ల విలువైన సహాయ ప్యాకేజీని అమెరికా ప్రతిపాదించింది. ఈ కార్యక్రమానికి బ్రిటన్ లోని కుంబ్రియాలో ఉన్న బీఏఈ సిస్టమ్స్ ప్రధాన కాంట్రాక్టర్ గా వ్యవహరించనుంది. అపాచీ హెలికాప్టర్లకు 198.2 మిలియన్ డాలర్లుప్రస్తుతం భారత్ సైన్యం, వైమానిక దళం ఏహెచ్-64ఈ అపాటీ హెలికాప్టర్లను వినియోగిస్తున్నాయి. ఇవి ప్రపంచంలోని అత్యాధునిక దాడి హెలికాప్టర్లలో ఒకటిగా గుర్తింపు పొందాయి. లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేయడం, యుద్ధభూమిలో సైన్యానికి మద్దతు అందించడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. ఈ హెలికాప్టర్లకు అవసరమైన దీర్ఘకాలిక నిర్వహణ, ఇంజినీరింగ్ సేవలు, సాంకేతిక సాయం, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బందికి

